# మంచులాంటి నిజం

గంటి రమాదేవి

**చిం**తలపూడి వారి సంబంధం చేసుకున్నా బాగుండిపోయేది!

అమ్మాయి డొంక సంపంగి పువ్వులా, మిసమిసలాడుతూ వుంది.

''స్వర్ణపనస పండు తొనలా పచ్చగా వుంది.

మామయ్య చెప్పాడు. కట్నం కాష్ 3 లక్షల్లు. ప్రైవేటు క్లినిక్ పెట్టుకోడానికి ఒక ప్లాటుగాని, ఒక కారు గాని-ఏదో ఒకటి. అమ్మాయి పేర అప్పనపిల్లి గోదారి వడ్డున మూడెకరాల కొబ్బరితోట. అమ్మాయి అమ్మమ్మ ఇచ్చిన నలభై తులాల బంగారం-ఇంకా...

పెళ్ళిచూపులు చాలా బ్రహ్మాండంగా జరిగాయి. నరసాపురం రేవులోకి మారుతి కారు పంపారు.

నేను కారు దిగగానే అరుగుల మీద కూర్చున్న పెద్దమనుషులు లేచి నిలబడ్డారు.

తలుపుల వెనక నుంచి, తెరల మాటు నుంచి, పిల్లలూ, ఆడవాళ్ళు-తళుకుల కన్నె పిల్లలు-నన్నే చూస్తున్నారు.

పెళ్ళి చూపుల్లో వాళ్ళు పెట్టిన పదార్థాలు. నలభైమందికి సరిపోతాయి.

మేము వెళ్ళింది ముగ్గురం-

బాబాయి, నేను-ముఖ్యుడు మా మామయ్య-ఆయనే సూత్రధారి.

జిలేబీలు, కాజాలు, తొక్కుడు లడ్లు, పూతరేకులు, గోరుమిటీలు, కారప్పూస, మిక్చరు, అటుకులు, పులిహోర, వేడి వేడి అంటికాయబజ్జీలు, చిన్న ఉల్లిపాయల పకోడీలు.

అమృతపాణీ అరటిపళ్ళు, పాల సపోటాలు, ఆపిలు పళ్ళు (అవి రాజమండ్రీ నుంచి ఆ రోజే తెప్పించారుట) జామపళ్ళ ముక్కలూ, గంగాబొండాలు.

నాలుగయిదు క్రేటుల నిండా కోకా-కోలాలు.

పెళ్ళికూతురు తండ్రి మరీ వంగిపోతూ అన్నాడు- ''ఏదో పల్లెటూరి వ్యవహారం-ఇంతకన్నా వీలుకాలేదు-''


మా మామయ్య అన్నాడు- ''అమ్మమ్మ! ఎంతమాట! కళ్ళు చెదిరిపోతుంటేను-మా వాడు డాక్టరు కాబట్టి, నా ప్రక్కనున్నాడు కాబట్టి, కొల్లస్ట్రాలూ అంటాడని కాని, లేకపోతే ఓ పట్టుపట్టనూ-''

''మా వాడు డాక్టరు కాబట్టి'' ఎందుకంత స్ట్రెస్ చేసాడో నాకు తెలుసు- అదే కద

తురుపుముక్క- ఆ ముక్కతో ఇంకో పదో పరకో(వేలు)గుంజొచ్చని ఆయన మనసులో మాట నేను ముందే కనుక్కున్నాను.

''ఒరేయ్ రమేషూ! నువ్వు డాక్టరువి అన్న సంగతి ఒకటే గుర్తుంచుకో. బాక్సరూ, ముష్టి యుద్ధాలు అని మీ మావగార్ని-బెదర గొట్టకు. వాళ్ళకు తెలీదు.'' అని వార్నింగ్ ఇచ్చాడు ముందే-

అదే చేసాను- ఈ



బాక్సింగ్ గురించే మాట్లాడాను.

-కొత్త బాక్సింగ్ సెన్సేషన్ బ్రూనోగురించి!

-మొన్ననే జైలుకెళ్ళొచ్చి విడుదలయిన మైక్‌టైసన్ గురించి?!

-రేంకింగ్‌లో మూడోవాడైన లూయిస్ గురించి-వాడి బ్రిటన్ గురించి,

-ఇంకా ఆలివ్ మేకాల్, టోనీ టక్కర్, హెన్రీ ఆకిన్‌వాండా రష్యావాడైన అలెగ్జాండర్ జోలేకిన్! జెర్మీ విలియమ్స్; డోనాల్డ్; మొన్నటివరకు మంచి రాంకింగులో వుండి దిగజారిన హోలీఫీల్డుల గురించి ముసలాయన (కాబోయే మామగారు!) మాడు పగిలేలా ఎడాపెడా వాయించాను.

దెబ్బకి దిమ్మతిరిగి - ''మా కొద్దుబాబూ ఈ బాక్సర్ అల్లుడు -ఏదో డాక్టరని ఆశపడ్డాం-'' అంటాడని అనుకున్నాను-ఆయన ఫేసు చూసి అదే అనుకున్నాను.

ఆ తర్వాత కాలేజీలో నా బాక్సింగ్ కేరీర్‌ను గురించి మరో ''కొసరు'' వాయింపు వాయించాను. ఇలా మాట్లాడుతూ వున్నప్పుడే అమ్మాయి తళుక్కున రావడం-వెళ్ళిపోవడం జరిగిపోయింది.

నేను చూడలేదు-

నా రజని వుండగా ఈ చింతపులుసు అమ్మాయి (ఎంత బాగున్నా) నాకెందుకు?

ఆ తర్వాత- ఆరోజు నా నిర్ణయం ఎంత దారుణమైనదో ఎటువంటి పరిస్థితులకు దారి తీసిందో-తెలిసింది-రజని-మెరిసే మిన్నాగు!!

ఇప్పుడు క్షణ మొక నరకం!

భయంతో నిమిష మొక యుగంగా గడుపుతున్నాను!!

నేను పనిచేస్తున్న-జెమినీ క్యూర్ హోం'' ప్రైవేటు హాస్పిటల్ యజమాన్యం నాకు వార్నింగ్ ఇచ్చింది.

పేషంట్లు వున్నా-టైము అయేసరికి అన్నీ విడిచి వెళ్ళిపోతున్నానుట.

పనిలో నిర్లక్ష్యం చూపిస్తున్నానుట.

ఈ క్లినిక్ వాడిచ్చే ''సిండా'' మూడు వేలకు పది గంటలూ, పన్నెండు గంటలూ ఎవడు పనిచేస్తాడు?

రజనీతో అపాయింటుమెంటు.

ఒకరోజు-లవర్స్‌పార్క్‌కి!

ఒకరోజు-కేండిల్ లైట్ డిన్నర్-హోటల్ తోపాజ్‌లో.

మరోరోజు ఆనంద్ డీలక్స్ థియేటర్‌లో-'' ఫారెస్ట్ గంఫ్-''పిక్చరు. తను ''ఇండీసెంట్ ప్రపోసల్''కి వెడదామంది-ముందు.

రజని శ్రీనిధి ఎపార్ట్‌మెంటులో వుం టోంది. I.T.Cలో రిసెప్షనిస్టు. మొగలి పువ్వులా, నిండుగా, అందంగా వుంటుంది -రజని.

నాకేం తెలుసు-మొగలి పువ్వులో విష నాగులుంటాయని.

ఆరోజు సూపరింటెండెంటు నన్ను తన రూముకి పిలిచి బాగా పెట్టాడు-గడ్డి-

''లుక్! రమేష్! ఇది ప్రైవేట్ హాస్పటల్-గవర్నమెంటు ఆసుపత్రిలా టైము ప్రకారం వెడతానంటే కుదరదు-''

ఇరవై తారీకు ఆరోజు- జీతం ఎంత జాగ్రత్తగా వాడినా పదోరోజే అయిపోయింది.

రజనీతో లంచ్ కెళ్ళాలన్నా, సినిమా కెళ్ళాలన్నా-ఆఖరికి ఆటో ఎక్కాలన్నా ముందూ వెనకా చూసుకోవలసి వస్తోంది.

పదివేల రూపాయల ఉద్యోగం వుంటే కాని నా కనీసవసారాలు తీరవు.

డాక్టరు పరీక్ష పాసవగానే వెంటనే పూల హారాలతో స్వాగతం చెప్పి ఉద్యోగం ఇస్తారన్న అపోహ వుండేది- మెడికల్ కాలేజీలో చేరకముందు.


మెడిసన్‌లో సీటు రాగానే 'క్లౌడ్ 9'' మీద స్వారీ ప్రారంభించాను. మెడిసన్‌లో సీటు రాక బి.ఏ.-బి.ఎస్సీలో చేరిన పాత స్నేహితులని దూరంగా వుంచాను.

నేనో ప్రొఫెషనల్ని-వాళ్ళు ఆర్ట్ గాళ్ళు-

ఆ కలలన్నీ అగ్గిలో పడ్డ మల్లెపూవులా మెడిసన్ పాసయిన నాలుగయిదు నెలల్లోనే కూలిపోయాయి.

నాతోపాటు ఇంటరు వరకు చదివిన మహేంద్ర బి.ఏ.లో చేరాడు. ఆ తర్వాత ఎరువుల వ్యాపారం పెట్టాడు...వెధవ-సరిగా మెదడు లేకపోతే ఇలాగే చవకబారు పనులు చేయవలసిందే. మహేంద్ర నాలుగయిదు సార్లు కనపడ్డా-మాట్లాడలేదు-నేనా ఎం.బి.బి.ఎస్-వాడు బి.ఏ-అంటే బొత్తిగా అన్యాయం.

సంవత్సరం నిరుద్యోగం తర్వాత ఈ 'జెమినీ క్లినిక్'లో జాబ్ దొరికింది.




''సో-'' అన్నాను నిర్లక్ష్యంగా.

''ఇష్టం లేకపోతే చెప్పు-మూడు వేలలో ''మూ'' అన్న శబ్దం ఉచ్చరించే సరికి ముగ్గురు డాక్టర్లు గేటు దగ్గరుంటారు.

నాకు వళ్ళు మండిపోయింది.

''మూడు అనే లోపల ముగ్గురొస్తారు- ఏడు అని చూడు ఏడుస్తారేమో-''

సూపర్నెంటు ముఖం మాడిపోయింది.

''కొన్ని క్షణాల తర్వాత అన్నాడు-''గో''-

''పోక వుట్టికట్టుకు వూరేగుతానా-'' అని బయటకు వచ్చాను. బయటకు వచ్చి I.T.C రిసెప్షన్‌కు ఫోను చేసి ''రజనీ'' అన్నా తీయగా.

''ఏంటి ఇప్పుడు చేసావు-'' అంది రజని డ్రైగా.

ఈ మధ్యన నెల రోజులుగా రజని డ్రైగానే వుంటోంది నాతో.

''ఉద్యోగం వూడేట్టుంది-''

''బిజీగా వున్నా- తర్వాత మాట్లాడతా-''

''తర్వాత చెయ్యనా-''

''చెయ్యకు-నేను వారం రోజులు వుండను-ఊరెళుతున్నా-

''ఏ వూరు?''

రజని సమాధానం చెప్పలేదు. ఫెడీమని ముఖం మీద కొట్టినట్టు ఫోను పెట్టేసింది.

నా మనసు కీడు శంకించింది.

ఇప్పుడేం చెయ్యాలి-?

రూం కెళ్ళి పడుకున్నాను-

మర్నాడు, తర్వాతి రోజు మామూలుగా గడిచిపోయాయి. మూడో రోజు నేననుకున్నది జరిగింది.

ఈ నెలాఖరు వరకు నా వుద్యోగం వుంది- ఆ తర్వాత జెమినీ సంస్థ యాజమాన్యానికి నా సేవలు అవసరం లేదుట. ఇన్నాళ్ళూ ఎంతో సిన్సియర్‌గా సేవ చేసినందుకు కృతజ్ఞలత.-

''సిన్సియర్‌గా సేవ చేస్తే-తీసెయ్యడమెందుకు?-

హైపోక్రేట్స్-

నా సీటులో ఎవరో వచ్చారు.

నా పని అటెండన్సులో సంతకం పెట్టడం-బయట తిరగడం-నా చేతక్ స్కూటర్-చెర్రీ

పండు రంగుది. ఈ కలరంటే నా కిష్టం దాని మీదే తిరుగుడు.

క్లినిక్‌లో ఖాళీగా కూచున్నా. ఒక్క పేషంటూ నా దగ్గరకు రావడం లేదు. చేతక్ మీద రోడ్డున పడ్డాను-

గమ్యం లేని ప్రయాణం-

అప్పుడు చూసాను-కారులో-మారుతీ ఎస్టీమ్-ఎ.సి కారులో మహేంద్ర, బి.ఏ గాడి ప్రక్కన రజని.

ఎర్రని కాల్చిన ఇనుప వూస కంట్లో గుచ్చినట్లుగా ఆ దృశ్యం!

రజని ఎందుకలా చెప్పింది? అబద్ధం!

వారం రోజులు వూరుకెడుతున్నానని-

పిచ్చెక్కినట్టు తిరిగాను-సాయంత్రం వరకు.

చీకటి పడుతూండగా రజని ఎపార్ట్‌మెంట్సుకు వెళ్ళాను.

చేతక్ పార్క్ చేసి మెట్లెక్కుతూంటే చూసాను- ఆ మహేంద్ర గాడి కారు గేటు బయటకు పోతూ వుంది.

గబగబా మెట్లెక్కి-రజనీ అపార్ట్‌మెంటులోకి అడుగు పెట్టాను.

రజని లోపల ఎక్కడో వున్నట్టుంది- ''బహుత్ ప్యార్ కర్‌తే హై-తుఝుకో సనమ్-'' అన్న పాట ''హం''చేస్తోంది.

మెల్లగా లోపలకు వెళ్ళాను.

ఇన్నాళ్ళ పరిచయంలో రజనినెప్పుడూ అలా చూడలేదు. వంటిమీద దారం పోగు లేదు-ఇటాలియన్ మార్బుల్ విగ్రహంలా-నున్నగా-వంపులు తిరిగి-నిగనిగ మెరుస్తూ-పూర్తి నగ్నంగా-

గబుక్కున నావేపు తిరిగింది-దగ్గరగా వున్న తువ్వాలు గబుక్కున వంటికి చుట్టుకుంది. -నావైపు అసహ్యంగా చూస్తూ, చేత్తో తలుపు వైపు చూపి-''గెటవుట్''-ఫూల్''అంది.-ఆమె చేతి గాజులు తళుక్కుమన్నాయి. రజని చేతికున్న మూడు జతల రవ్వల గాజులు నేనిచ్చినవే- నా సంపాదనలోది కాదు- అమ్మ నగలు అమ్మి-

''రజనీ-ఎవడు వాడు.''కోపంగా అన్నాను.

రజని తలుపులు బిగించుకుంది. బెడ్ రూంలోకి పరుగెత్తింది- నేను డ్రాయింగ్ రూంలోకి వచ్చాను.

ఆ సోఫా, డ్రెస్సింగ్ టేబులు, యూఫోం పరుపు నేనిచ్చినవే.

నాన్న పి.ఎఫ్- కమ్యూట్ చేసి రజని చేతుల్లో పోసాను.

ఈ సోఫామీద వాడుకూచున్నాడు-రజని పూర్తి సౌందర్యం ఈ డ్రెస్సింగ్ టేబులు అద్దంలో చూసాడు-అంటే....అంటే-

రజని ఫుల్‌గా డ్రెస్సు అయివచ్చింది.

గబుక్కున బెడ్ రూంలోకి పరుగెత్తాను-నా అనుమానం?

నిజమే!

రెండు మేని సెగల ఉష్ణానికి స్ఖలితమైన సుఖ బిందు సమ్మేళనం!

పక్కంతా నలిగి-...

అగ్నిపర్వతంలా నా మనస్సు భగ్గుమంది- నా దనుకున్న రజని-

''మహేంద్ర ఎప్పుడొచ్చాడు! ఎన్నాళ్ళ నుంచి?''

''మధ్యాహ్నం-నెలనుంచి'' నిర్లక్ష్యంగా అంది రజని.

''ఎందుకింత మోసం చేసావ్?''

''ఏదో గొప్ప డాక్టరువనుకున్నాను-నా

జీతంలో సగంలేని ఉద్యోగం. బండ రాయి లాంటి శరీరంగల బాక్సర్- అదీ లేదు, ఇదీ లేదు..'' మహేంద్రకు రోజా లాభమే నలభైవేలు-ఎరువుల వ్యాపారం-'' నాకు మనసు చికితిపోయింది అవమానంతో-

''మధ్యాహ్నం నుంచి ఏం చేసారు?''

''సరదాగా గడిపాం-వుయ్‌హేడ్ సెక్స్-అఫ్‌కోర్స్ ఎవ్విరీ సెకండ్ డే వుయ్ హేవ్ సెక్స్-''

నాలో ఒక నరం ఏదో టప్పున తెగింది.

''యూ బ్లడీ బిచ్-'' అని ఈడ్చి కొట్టాను-

రజని విసురుగా గోడకు కొట్టుకుంది- నేల మీద పడిపోయింది. దగ్గరగా వెళ్ళాను.

రజని నేల మీద పడివుంది. గోడుకు తల తగిలింది. గోడమీద రక్తం-

దగ్గరగా వెళ్ళాను. రజని కోపంగా నా చెయ్యి పట్టుకుంది. వెంటనే వాలిపోయింది. దభీమని క్రింద పడింది. ''చచ్చింది'' అనుకున్నాను కసిగా.

చప్పుడు చెయ్యకుండా బయటకు వచ్చాను.

రేపు ఏదో ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చుకోవచ్చు. తనని కొట్టానని పోలీస్ కంప్లయింట్ ఇస్తుందా? బ్రతికుందా అసలు?

మెట్లు చీకటిగా వున్నాయి.

స్కూటర్ తీసుకు బయట పడ్డాను-

ఇంటికొచ్చి వాష్ బేసిన్‌లో మొఖం కడుక్కుని పడుకున్నాను.

ఛీ...ఏమిటీరోజు-

ముంచేతి భాగం చిరచిరమంటోంది-

రక్తం చిమ్మి గడ్డ కట్టింది. రజని గోళ్ళ గుర్తులున్నాయి స్పష్టంగా.

''బ్లడీ బిచ్-రక్కింది-వుయ్ హేడ్ సెక్స్-డెయిలీ-'' ఆ రాత్రంతా కలత కలతగా నిద్రపోయాను-

★ ★ ★

మర్నాడు రజని అపార్ట్‌మెంటు ముందు నిలబడ్డాను. ఎవరికీ అనుమానం రాకుండా స్కూటర్ ప్లగ్ తీసి క్లీన్ చేస్తూ-

పోలీసు జీపు- ఏంబులెన్సు-

స్ట్రెచర్‌లో తెల్లగుడ్డ కప్పబడ్డ రజని-

ముఖం కప్పేశారు- అంటే- అది-

వళ్ళంతా చెమటలు పట్టింది- నేనే చంపాను-

మర్డర్‌కి మరణ శిక్ష పడుతుంది.

ఆలోచించగా ధైర్య వచ్చింది-ఎవిడెన్సు ఏముంది? ఐ యామ్ సేఫ్.

మర్నాడు పేపర్లలో పడింది.

''వంటరిగా వున్న యువతి హత్య!

రజని అన్న యువతి తన అపార్ట్‌మెంటులో తలపగిలి చచ్చి పడివుంది-

పోలీసులు పరిశోధిస్తున్నారు-''

## కిడ్డీ బ్యాంక్;

''ఈ కిడ్డీ బ్యాంకులు వచ్చిన తరువాత పిల్లలంతా మరీ పిసినారుల్లా తయారయ్యారోయ్'' అన్నాడు వెంకట్రావ్

''అంతేకాదు, పిల్లల తల్లిదండ్రుల్ని చిల్లర దొంగలుగా కూడా మార్చేశారు!'' చెప్పాడు అప్పారావు.

- పి. రాధిక
(హంపసాగర)

పరిశోధనలో నా పేరు బయట పడుతుందా! గుండె దడదడలాడింది. అంతలో సర్ది చెప్పుకున్నాను. నో ఎవిడెన్స్-

ఆ రోజు నుంచి ప్రతీ రోజూ పేపరు చూస్తున్నాను.

ప్రముఖమైన పేపర్లు ''డెక్కన్ క్రానికల్'', ''ఆంధ్రభూమి'', ''ఎక్స్‌ప్రెస్'', ''ప్రభా'', ''జ్యోతి''లలో ఎక్కడా లేదు- ''హిందూ'' వాడు ముందే వేయలేదు.

ఓ చిన్న పత్రిక - ''నేల-రైతు'' మాత్రం ఫాలో చేస్తోంది.

పోలీసులు హంతకుడి ఆచూకీ తెలిసిం దట...నా నోరు తడారిపోయింది.

ఏ క్షణంలోనైనా నన్ను అరెస్టు చేస్తారు! మళ్ళీ ధైర్యం! నా వరకూ రాదు. తళుక్కున ఓ ఆలోచన తట్టింది- దీనికంతా కారణం మహేంద్ర గాడే కదా! వాడికి ఎంజాయి మెంటూ-నాకు మరణ శిక్ష! పోలీసుల దృష్టి అటు మళ్ళించాలి.

రజని కేసు పరిశోధిస్తున్న పోలీసు స్టేషన్‌కు ఫోను చేసాను.

''రజని మర్డర్ కేసు పరిశోధిస్తున్న ఇన్‌స్పెక్టర్ని పిలు-''

''నువ్వెవరు?'' రఫ్‌గా అన్నాడు పోలీసు.

''వరధయ్య-'' ముఖ్యమైన సమాచారం-''

''వరధయ్య-వరదయ్యా- వుండు పిలుస్తా-''

ఇన్‌స్పెక్టరు గొంతు ఖంగుమంది.

''ఎస్-''

''రజనీ కేసులో హంతకుడు మహేంద్ర-ఎరువుల వ్యాపారి-వాడే చంపాడు-''

''నువ్వెవరు?''

''వరధయ్య''

''పూర్తిపేరు-ఎడ్రసు''

''పూర్తి పేరెందుకు? వెళ్ళి వాణ్ణి అరెస్టు చెయ్యి. వాడి కారు ఎస్టీము అపార్ట్‌మెంట్సు దగ్గర రోజంతా వుంది- వాడికే రజనీకి సంబంధంవుంది-''

''నీపూర్తి పేరు?''

''వల్లకాట్లో రామనాధయ్య-''

★ ★ ★

''నేల-రైతు'' పత్రికలో మర్నాడు హెడ్‌లైన్‌లో వచ్చేసింది.

''ఎరువుల వ్యాపారి మహేంద్ర అరెస్టు-''

హమ్మయ్య! నా మీద అనుమానం ఎవరికీ రాదు-

అది తొంతరపాటు అని మర్నాడే తెలిసింది.

మరసటి రోజు పేపర్లో నా మెడకు వురి బిగించే న్యూస్ వేసారు.


''రజని వుండే అపార్ట్‌మెంటులో వుంటున్న సిహెచ్.రంగారావు అనే ఆసామి ఇచ్చిన సమాచారం వల్ల, మహేంద్ర కాకుండా ఇంకోమనిషి, వచ్చాడుట. హంతకుడు వాడేనని మహేంద్ర అంటున్నాడు-వాడిది చెర్రీరంగు చేతక్ స్కూటర్!

నా గుండె గుభేల్మంది- ఎవరీ సిహెచ్. రంగారావు?- వీడికేం పనిలేదా?? నా స్కూటర్ వాడెప్పుడు చూసాడు?

భయపడుతూనే స్కూటర్ మీద బయలుదేరాను-క్లినిక్‌కి-

ఈ రోజుతో ఉద్యోగం ఆఖరి రోజు-

అకౌంటెంటు మర్యాదగా నా జీతం కవరులో పెట్టి ఇచ్చాడు.




ఈ ఎర్ర రంగు స్కూటర్ నా పాలిట యమపాశం-

ముందు దాని రంగు మార్చాలి! ఈ లోపల ఎవరైనా పట్టుకుంటే.

స్కూటర్‌కు రంగులు వేసే వాడే అనుమానించొచ్చు- రంగు చాలా కొత్తగా వుంది. ఎందుకు మారుస్తారని అనుమానపడితే?

అకౌంటెంటు అన్నాడు వినయంగా- ''సార్-స్కూటర్-''

ఉలిక్కిపడ్డాను-ఎక్కడో కాదు ఇక్కడే పట్టుబడ్డాను.

నాలుకతో పెదాలు తడుపుతూ అన్నాను- ''స్కూటర్-''

''ఇచ్చి వెళ్ళండి-అది క్లినిక్‌ది-''

★ ★ ★

వచ్చిన జీతంతో జాగ్రత్తగా కాలక్షేపం చెయ్యాలి. పై నెల నుంచి ఆదాయం లేదు. ప్రతిరోజూ ''నేల-రైతు'' చదువుతున్నాను.

మహేంద్రను ''నాన్ బెయిలబుల్ వారంట్'' మీద అరెస్టుచేసి రిమాండులో పెట్టారు. అయినా నాకు వురితాడుకు మధ్య సిహెచ్.రంగారావు వున్నాడు. అప్పుడు స్కూటర్ లేకపోయినా, నన్ను గుర్తుపడతాడేమో!

ఉద్యోగం లేదు కాబట్టి సెషన్స్ కోర్టుకు వెళ్ళాను.

మహేంద్ర బోనులో వున్నాడు-గడ్డం పెరిగి-కళ్ళులోపలికి పోయి. భుజాలు దిగజారి-దీనంగా వున్నాడు-

వాడు హంతకుడంటే కోర్టు కొచ్చిన జనం ఎవ్వరూ నమ్మలేదు.

అదే ఆ స్థానంలో నేనుంటే...వెంటనే నమ్మేస్తారు! నా పర్సనాలిటీ అలాంటిది. ప్రాసిక్యూషన్ లాయరు అరుస్తున్నాడు-

''ముద్దాయి పరమ కిరాతకుడు. అమాయకురాలైన యువతిని దారుణంగా రేప్ చేసి తల పగల గొట్టి చంపాడు-''

మహేంద్ర దీనంగా జనం వైపు చూసాడు-

జడ్జి కళ్ళ జోడు తీసి టేబులు మీద పెట్టి

వింటున్నాడు.

కేసు బాగానే తయారయింది.. పోలీసులు రజనీ, మహేంద్రల సంబంధం గురించి వివరాలు సేకరించారు- అదృష్టం-మహేంద్రకి ఇంకా సంబంధాలున్నాయట-

''మి లార్డ్-మహేంద్ర ఓ ప్లే బాయ్- రజనీతో పెట్టుకున్నాడు-అభిప్రాయ బేధా లొచ్చి చంపేసాడు-''

కోర్టు హాలులో జనం మహేంద్రను చూసిన తర్వాత, ప్రాసిక్యూషన్ లాయరు వాదన పేలవంగా అనిపించింది.

జడ్జి కూడా ''బోర్డ్'' ఫీలింగ్ మొహం మీద చూపించారు.

అప్పుడు లేచాడు డిఫెన్సు లాయరు.

''మిలార్డ్! నా క్లయింటు నిర్దోషి అని నిరూపించే ముఖ్యమైన ఆధారం ఒకటి దొరికింది...అది...ఇదిగో-''అని జడ్జికి ఒక వస్తువు అందించాడు.

తల రిక్కించి చూసాను.

అది-అది స్టెతస్కోపు--రజనీ ఇంటిలో పడిపోయింది-నా స్టెతస్కోప్. నాది. నా గుండె రెండు క్షణాలు ఆగి మళ్ళీ కొట్టుకుంది.

''ఎవరో రజనిని చంపి ఆ నేరం నా క్లయింటు మీద వేసారు?''

ప్రాసిక్యూషన్ లాయరు, వెటకారంగా నవ్వి అన్నాడు-'' ఏదో వస్తువు చూపించి అది అక్కడుంది కాబట్టి-ముద్దాయి నిర్దోషని అంటే సరిపోతుందా? ప్రూఫ్‌కావాలి మై లెర్నడ్ ఫ్రెండ్-''

డిఫెన్సు లాయర్ నిర్వికారంగా అన్నాడు- '' ఆ స్టెత స్కోపుమీద రక్తం వుంది-అది ఎన్లైజ్ చేస్తే తెలిసిపోతుంది- మా క్లయింటు రక్తపు గ్రూప్ ఏ పాజిటివ్-''

జడ్జ్ ముఖం వికసించింది- ''గుడ్! పోలీస వారు ఈ విషయం గురించి పరిశోధించాలి ఆ స్టెతస్కోపు వ్యక్తిని పట్టుకోవాలి...రజని తెలిసిన మెడికల్ ప్రొఫషన్ వాళ్ళ రక్త పరీక్ష చేసి అది ఈ ''డిఫెన్సు ఎగ్జిబిట్''తో కలుస్తుం దేమో చూడండి-అంతవరకు ముద్దాయి రిమాండులో వుంటాడు-''

తడబడుతూ బయటకు వచ్చాను-- మహేంద్ర మీద కేసు దూది పింజల ఎగిరిపోతుంది- ఈ రక్త పరీక్ష జరిగితే--అది నాదే-పైగా నాది ''రేర్'' బ్లడ్ గ్రూప్-

బయటకొచ్చి, కోర్టు కాంపౌండులో వున్న కాంటీన్లో ''టీ''తాగాను- బైటకొస్తూ అనుకున్నాను-

ఈ పట్నంలో వేలమంది మెడికల్ వాళ్ళున్నారు?

నేనని ఎలా తెలుస్తుంది- తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాను.

ఇంటికి వెళ్ళిన తర్వాత గుర్తుకొచ్చింది-

సిహెచ్.రంగారావు...నా ''అక్కిలీస్ హీల్'' -నా వీక్ పాయింటు. వాడింటికి వెళ్ళి చూడాలి.

★ ★ ★

ఉదయం ఎనిమిది లోపలే రంగారావు ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. ''నన్ను గుర్తుపడతాడో లేదో టెస్టు చెయ్యాలి-''

గుర్తు పడితే-

రంగారావు అపార్ట్‌మెంటు తలుపు తీసే వుంది. లోపలకు వెళ్ళాను. ఆయన భార్య బయటకు వచ్చింది.

''ఎవరు కావాలి?''

''రంగారావు గారు'' అన్నాను. ఆయన వచ్చి- ''ఏం కావాలి'' అంటే ఏం చెప్పాలి?''

లోపల్నుంచి బయటకు వచ్చాడు- నడివయసు దాటిన మనిషి-బనీను-లుంగీ-బట్టతల-ఛాతీమీద నెరిసిన వెండ్రుకలు...కళ్ళజోడు...

''నమస్కారమండీ-నేనో డాక్టర్నండి-ప్రముఖ న్యూరో సర్జన్ రంగారావు గారంటే మీరేనా?-'' అనడిగాను పట్టుబడకుండా.

ఆయన నన్ను ఎగాదిగా చూసి అన్నాడు-''నేను డాక్టర్నేంటడీ బాబూ! వ్యవసాయదారుణ్ని-పిల్లల చదువుల కోసం- పట్నంలో అద్దెకుంటున్నాను-''

''సారీ! అనవసరంగా శ్రమ ఇచ్చాను-'' అంటూ బయటకు వచ్చాను. ఈ రంగారావెవరో నన్ను గుర్తు పట్టలేదు---ఫర్వాలేదు---కాని. అప్పుడు బాంబులా పేలిందా మాట-

''మిమ్మల్నెక్కడో చూసాను---డాక్టరన్నారు కదూ-''

★ ★ ★

తర్వాత రెండు రోజులూ రూములోంచి కదలలేదు...

ఏ పోలీసుని చూసినా భయం.

వయస్సు మళ్ళిన బట్టతల వాళ్ళు యములాళ్ళలా కనపడుతున్నారు.

మూడోరోజు తెల్లవారుతూనే తలుపుమీద చప్పుడు-

తలుపు తెరిచాను-

సిహెచ్.రంగారావు.

నా ముఖం పాలిపోయింది.

ఆయన నవ్వుతూ అన్నాడు-

## సహాయం

ఓ పల్లెటూరి దానయ్య రష్‌గావున్న బస్సులో ఓ చేత్తో బరువైన సంచి పట్టుకొని, ఓ చేత్తో పైనున్న రాడ్ పట్టుకుని నిలబడి వున్నాడు. కండక్టరు దానయ్య దగ్గరికి వచ్చి టికెట్టు తీసుకోమన్నాడు. సంచీ క్రింద పెట్టడానికి స్థలం లేక, పైనున్న రాడ్ వదలటానికి కుదరక అసహాయంగా చూస్తున్న దానయ్యను కండక్టరు అడిగాడు ''నేనేమైనా సహాయం చెయ్యనా?''

దానయ్య ఓ క్షణం ఆగి ''పైనున్న ఈ రాడ్‌ను కాస్త పట్టుకోండి!'' అన్నాడు.

- పి.రాధిక (హంపసాగర)

''మిమ్మల్ని గుర్తుపట్టాను-నేను మళ్ళీ వస్తాను.''

★ ★ ★

ఇంట్లోంచి బయటకు కదలడం లేదు. పగలూ, రాత్రి పడుకునే వుంటున్నాను.

ఏదో ఇంత తినడం- నిద్రపోవడం.

''నేల-రైతు'' కొనడం లేదు. అసలు బయటకే వెళ్ళడం లేదు.

ఈ సిహెచ్.రంగారావు ప్రెస్ వాళ్ళకో, పోలీసులకో చెబుతాడు-ఇక నా పని ఔట్-న్యాయానికి వెయ్యి కళ్ళు-మహేంద్ర అమాయకుడు-నేనే హంతకుణ్ని- అయితే! నేనెందుకు వురి బిగించుకోవాలి?...ఎలా అయినా తప్పించుకోవాలి! పోలీసు స్టేషన్‌కు ఫోను చెయ్యాలనిపించింది.

డ్రెస్సు చేసుకుని తలుపు తీసాను.

ఎదురుగా పోలీసు ఇన్‌స్పెక్టర్--

తూలి పడి తలుపు పట్టుకున్నాను-

''మీరేనా డ్క్టర్ రమేష్...''

''ఎస్-'' అన్నాను గొంతులో గుండె అడ్డుపడినట్టు.

కొన్ని నానో సెకండ్ల భయంకర నిశ్శబ్దం-

''యూ ఆర్ అండర్ అరెస్ట్-అనూ-అనరా....అను...నేనందుకి సిద్ధమే-''

''మీరు ఐ.పి.ఎమ్ బ్లడ్ బ్యాంకులో మెడికల్ సైంటిస్టుగా అప్లయి చేసారా?-'' నా శ్వాస మళ్ళీ ఆడుతోంది...

''ఏమో! గుర్తులేదు-''అన్నాను.

'' ఆ ఉద్యోగం వచ్చింది మీకు- గవర్న మెంటు ప్రొసీజర్-పోలీసు వెరిఫికేషన్-అంతా వెరిఫై చేసాం. ''జెమినీ క్యూర్ హోం''లో అడిగాం- ఆ డ్క్టర్ గుడ్ రిపోర్టు ఇచ్చాడు-''

ఆశ్చర్యపోతూ చూశాను...ఏం నాకు అదృష్టదశ తిరుగుతోందా?

ఆ అనుమానం మరుక్షణమే వీడిపోయింది.

''ఓ మర్డర్ కేసులో మెడికల్ ప్రొఫెషనల్స్ బ్లడ్ సాంపిల్లు తీసుకుంటున్నాం. పన్నెండింటికి స్టేషన్‌కు వచ్చి బ్లడ్ సాంపిల్ ఇవ్వండి...''

అంతే- అదే ఆఖరి మజిలీ...నా బ్లడ్ గ్రూప్ టాలీ అవడం ఖాయం-

''రేర్ గ్రూప్-'' రజనీ చేతి వేళ్ళలో వున్న రక్తం- నాది ఒకటే. మానుతున్న ఆ గాయం వైపు చూసాను- ఈ అయిదు వేళ్ళ గుర్తులు నా పంచ ప్రాణాలూ హరిస్తాయి.

ఇక నన్నాదేముడు కూడా రక్షించలేడు.

★ ★ ★

ఆ సాయంత్రం సిహెచ్.రంగారావు వచ్చాడు.

''అబ్బాయ్! నన్నుగుర్తుపట్టావా?'' చింతల పూడి రంగారావుని.. సిహెచ్.రంగారావు..అని...'' నీరసంగా వుంది-లేదని తలూపాను.

''చింతలపూడి పెళ్ళి చూపుల్లో చూసావు...నిర్మల-పెళ్ళికూతురు-మా అన్నగారి కూతురే...నీ దగ్గర్నుంచి సమాధానం రాకపోయేసరికి మా వాళ్ళు కంగారుపడుతున్నారు-ఏమిటీ నీ అభిప్రాయం..''

ఏమిటీ వింత? ఓ ప్రక్క గవర్నమెంటు ఉద్యోగం-మరో పక్క వురితాడు! ఓ పక్క పెళ్ళి సంబంధం- మరో పక్క చావుకి ముహూర్తం!!

''అభిప్రాయమే నాదీను-'' అన్నాను ఏమనాలో తెలియక.

''సంతోషం-బాబూ-వస్తాను-''అని ఆయన వెళ్ళిపోయాడు.

సంభాషణ ముగించాలన్న నామాట ఆయన వేరే విధంగా అర్థం చేసుకున్నాడు-

నాకు తెలియకుండానే పెళ్ళి పనులు జరిగిపోతున్నాయి.

★ ★ ★


నా రక్తం సాంపిల్ ఇచ్చాను. అది పరీక్షకు పంపబడింది.

నిమిషాలు, గంటలు, రోజులు లెక్క పెడుతున్నాను.

ప్రతీక్షణం టెన్షన్...ఎప్పుడు నా చేతికి బేడీలు పడతాయో! పదిహేను రోజులు గడిచిపోయాయి.

ఓ రోజు బిలబిలమంటూ మా వాళ్ళు వచ్చేసారు.

''మాకు చెప్పొచ్చుగా పిల్ల నచ్చిందని. పెళ్ళికూతురు పినతండ్రికి చెప్పాలా...'' అని




నిష్కర్షగా మాట్లాడాడు- మామయ్య.

''అది కాదు-మామయ్యా-నీకెలా చెప్పాలో తెలియక-''

''ఎలా తెలుస్తుందిరా-జున్ను ముక్కలాంటి పిల్లని చూసిన తర్వాత మేమెలా గుర్తుంటాం-సర్లే మళ్ళీ వారామే పెళ్ళి-గుడ్డిలో మెల్ల-ఇదయినా మా చేతుల మీదుగా జరుగుతోంది-''

నా నాలుకను తాళ్ళతో కట్టేసినట్టు మాట రాలేదు.

వారం రోజులు గడిచిపోయినా అరెస్టు వారెంటు రాలేదు.

నా పెళ్ళి నిర్మలతో అయిపోయింది...

యాంత్రికంగా జరిగిన పోయిన పెళ్ళిలో నా కేదీ గుర్తు రాలేదు.

నా కళ్ళు వెతికేది పోలీసు జీపు గురించి. ఉక్కు సంకెళ్ళ గురించి...

ఒక్క విషయం గ్రహించాను.

నిర్మల చిన్నబుచ్చుకుంది.

★★★

పది రోజుల తర్వాత తెలిసింది.

ఆలస్యానికి కారణం.

అదీ నేను కొత్త ఉద్యోగంలో చేరిన తర్వాత.

బ్లడ్ సాంపిల్స్ అన్నీ పరీక్ష చెయ్యబడ్డాయి. సంతకం చెయ్యవలసిన డ్యాక్టర్, రిజైన్ చేసి ''బ్రూనై'' దేశం వెళ్ళిపోయాట్ట-రాజీనామాకు ఇవ్వవలసిన గడువుకు బదులుగా డబ్బు కట్టేసాడు...ఇక్కడ నెల జీతం అక్కడ గంటల్లో సంపాదిస్తాడు. ఇక్కడ టైము వేస్టు.

అదృష్టం మీద నమ్మకం లేకపోయినా, నిర్మల మాంగల్యబలం గట్టిదనిపించింది.

ఆ రిపోర్టులన్నీ ఇప్పుడు నేనే సంతకం పెట్టాలి.

గబగబా నా రిపోర్టు చదివాను.

సంతకం పెట్టని ఆ రిపోర్టు నా పాలిట మృత్యుశాసనం.

నా బ్లడ్ గ్రూప్, మహేంద్ర బ్లడ్ గ్రూప్ మార్చేసి రిపోర్టు తిరిగి రాసాను.

అన్నీ పాత తేదీలతో సంతకాలు పెట్టాను.

ఇక నన్నెవరూ ''పిన్ పాయింటు-

చెయ్యలేరు. ఇప్పుడు నేను బాధ్యతగల ప్రభుత్వాధికారిని. నామీద వున్న ఒకే ఒక్క సాక్ష్యం నేనే తిరగ రాసాను.

★ ★ ★

నా రిపోర్టుతో మహేంద్ర ఉక్కు ఫ్రేములో బిగించినట్టయ్యాడు

జడ్జ్‌మెంటు వచ్చింది.

డెత్ బై హేంగింగ్!

★ ★ ★

ఇంటికొచ్చిన తర్వాత నాడు భోజనం రుచించలేదు...

రజనిని చంపింది నేనేకదా?

ఆ నేరం నుంచి తప్పించుకునేందుకు మహేంద్ర చావుకు పరోక్షంగా కారణం నేనే-

నా మనస్సాక్షి నన్ను చిత్రవధ చేస్తోంది-

''నువ్వు మర్డరర్‌వి...''

మహేంద్ర నిర్జీవ శరీరం వురి తాడుకు వేలాడుతున్న దృశ్యం నన్ను కలచి వేస్తోంది. కళ్ళుమూసినా తెరిచినా అదే దృశ్యం.

జీవితాంతం ఈ పాపపు శిలువ మొయ్యవలసిందేనా.

ఆఖరుకి ఒక నిర్ణయాని కొచ్చాను. నా జీవితం ఇక ముగించాలి. మరి నిర్మల....

నేనేం చెయ్యను-ఈ మనోవ్యధ భరించ లేను.

హెవీ డోసులో నిద్రమాత్రలు మింగాను... అప్పుడే న్యాయానికి లొంగినా బాగుండేది.

ఇంకా కొన్ని గంటలే నా జీవితం-

అప్పుడు వినబడ్డాయి మాటలు...ఏదో మాట్లాడాలని నిర్మల తాపత్రయం.

ఇన్నాళ్ళూ ఏం మాట్లాడాలో తెలియలేదు. పాపం తనకు తెలీదు నా బాధ.

ఏదో ముఖ్య విషయం తెలిసినట్టుంది.

''మహేంద్ర అని మావూరి వాడే... ఎరువుల వ్యాపారం చేసేవాడు. ఇన్‌కంటాక్సు ఎగరేసి ఓ అమ్మాయింట్లో దాచాట్ట. దాని గురించి ఏదో గొడవ వచ్చి, ఆ అమ్మాయిని చంపేసాట్ట...ఇప్పుడు ఆ డబ్బంతా మా వూళ్ళో పట్టుకున్నారని బాబాయి ఉత్తరం రాసాడు.

నాకు కళ్ళు మూసుకుపోతున్నాయి. జరిగిదంతా ఓ క్షణంలో కళ్ళముందు మెదిలింది.

నేను నిర్దోషినా? మహేష్ నిజంగా రజనని చంపాడా?

ఏది నిజం!

మంచులాంటి నిజం-కప్పడిపోతూ-

క్రమంగా నాకు తెలివి తప్పిపోతోంది.

''రజనీ...నన్ను ఆస్పత్రికి...తీసుకెళ్ళు-''

నిర్మల విన్నదో లేదో-

★

